# జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్సి) నుండి తొలగింపబడినవారందరికీ పౌరసత్వం కల్పించాలి.

---

**అసోం** రాష్ట్రంలో జాతీయ పౌరజాబితా (ఎన్ఆర్సి) తుది రూపమిచ్చిన జాబితాలో 19 లక్షలమంది ప్రజానీకాన్ని తొలగించారు. ఎన్ఆర్సి నుండి తొలగింపబడినవారు 'ఫారినర్స్ ట్రిబ్యునల్'కు 120 రోజులలోపుగా విజ్ఞప్తి చేసుకోవచ్చునని చెప్పారు. ఈ క్రమం పూర్తయిన తర్వాత మిగిలినవారందరినీ శరణార్ధి శిబిరాలకు తరలిస్తారు. ఏ దేశమూ వీరందరినీ ఇముడ్చుకోబోవటంలేదు. 19 లక్షలమంది ప్రజల జీవితాలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేశారు.

ప్రస్తుతానికి అసోం రాష్ట్రంలో తాత్కాలిక వసతి సౌకర్యాలతో కూడిన ఆరు నిర్బంధ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఎన్ఆర్సి జాబితా నుండి మినహాయించబడిన వారికోసం మరో పది నిర్బంధ శిబిరాలను నిర్వహించేందుకు వీలుగా భవనాలు నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

అదేసమయంలో, 1955 సం॥ నాటి పౌరసత్వ చట్టాన్ని (సిటిజన్‌షిప్ యాక్టును) సవరిస్తూ 2016 జులై 19న 'ఇండియన్ సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్టు'ను లోక్‌సభలో ప్రతిపాదించారు. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేట్లయితే, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుండి చట్టవిరుద్ధంగా వచ్చిన అల్పసంఖ్యాక మతస్థులైన హిందూ, శిక్కు, బుద్దిస్టు, జైన్, పార్శీ లేదా క్రిస్టియన్ మతస్థులు భారతీయ పౌరసత్వానికి అర్హులౌతారు; ఒక్క ముస్లిము మతస్థులు తప్ప! పైన పేర్కొన్న శరణార్థులైన మతస్థులు భారత దేశంలో పౌర అర్హత పొందాలంటే అవసరమైన నివాస కాలాన్ని 11 సం॥ల నుండి 6 సం॥లకు తగ్గిస్తూ ఈ బిల్లు వెసులుబాటు కల్పిస్తోంది. అంటే, దీని అర్థం ఎన్ఆర్సిని తాజా పరచటం అనేది, అసోంలో నివశిస్తున్న అల్పసంఖ్యాక ముస్లిమ్ మతస్థులను పీడించి, హింసించేందుకేనని స్పష్టం అవుతోంది.

ప్రధానమంత్రి సైతం తన డిగ్రీ సర్టిఫికెట్లను సమర్పించలేని మనదేశంలో, 5 దశాబ్దాల వెనకటి డాక్యుమెంట్స్‌ను తీసుకురావటం ఏవిధంగా సాధ్యం? లక్షలాదిమంది భారతపౌరులు మనదేశం నుండి ప్రపంచవ్యాపితంగా వలసలు వెళ్ళి అనేక దేశాలలో పౌరసత్వం పొందివున్నారు. ఎన్ఆర్సి జాబితా నుండి మినహాయించిన వారిని భారతదేశం ఎందుకు ఇముడ్చుకోలేదు?

ఎన్ఆర్సి తుది జాబితా నుండి తొలగించబడిన 19 లక్షలమందికి భారత పౌరసత్వం కల్పించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామిక దేశమే అయ్యేట్లయితే, వారందరినీ అది నిర్బంధ శిబిరాల్లో ఉంచజాలదు.

**కేంద్రకమిటి,**
**సిపిఐ(ఎం-ఎల్)**

ооо